
ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024



స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం జ్యుడీషియల్ జిల్లా పరిధిలో సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ లుగా నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జడ్జి బి సాయి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. బార్ లో నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాదులుగా ఉంటూ 45 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు దీనికి దరఖాస్తు చేయడానికి అర్హులని పేర్కొన్నారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ లు వారంలో ఐదు రోజులపాటు ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ నియమితులైన వారికి నెలకు 45 వేల రూపాయల గౌరవ పారితోషికంతో పాటు ఐదు వేల రూపాయలు ప్రయాణ భత్యంగా మంజూరు చేస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగి న అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు 30వ తేదీలోగా జిల్లా కోర్టులో అందజేయాలని తెలిపారు.

ప్రజాసమస్యలే అజెండాగా ముందుకు సాగుతున్న సిపిఎం గడిచిన మూడేళ్లలో ప్రజలకు ఎంతో అండగా నిలిచింది. ఓవైపు ముందుకొచ్చిన సమస్యలపై పోరాడుతునే ఇంకోవైపు పేదలపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగాను, వారి హక్కుల పరిరక్షణకు, సమసమాజం కోసం శక్తిమేర ఉద్యమిస్తోంది. గత మూడేళ్ల కాలంలో ముఖ్యంగా పేదలు, దళితులు, గిరిజనులు సాగుచేస్తున్న భూములపై హక్కు కల్పించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పెద్దఎత్తున పోరాడింది. నిర్వాసితుల పక్షాన నిలిచి వారికి మెరుగైన నష్టపరిహారం అందేలా కృషిచేసింది. ఇలా ఒకటీ రెండూ కాదు. ఎన్నో చోట్ల స్థానిక సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపింది.




మెంటాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు(ఫైల్)

ప్రజా సమస్యలే అజెండా

- సిపిఎం పోరాటంతోనే పోడు పట్టాలు, ఇళ్ల స్థలాలు సాధించిన గిరిజనులు, పేదలు
- ఎర్రజెండా అండతో నిర్వాసితులకు న్యాయం
- అక్రమ వాటర్‌ప్లాంట్లపై అలుపెరుగని పోరు
- స్థానిక సమస్యలపై ఎక్కడికక్కడ ఉద్యమాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత మూడేళ్లలో ముందుకు వచ్చిన ప్రతి సమస్యపైనా సిపిఎం పోరాట గళం విపిపించింది. ముఖ్యంగా పేదలపై భారాలు మోపిన ప్రతి సందర్భంలోనూ వారి గొంతెత్తింది. భూముల పరిరక్షణకు, ఇళ్లు, ఇళ్లపట్టాలు, సాగు భూమికోసం ఎక్కువగా ఉద్యమించింది. వంగర మండలం తలగాం దళితులు సాగులోని భూములను స్థానిక పెత్తందారులకు కట్టబెట్టడంపై పోరాడింది. దిగివచ్చిన ప్రభుత్వం పెత్తందారులకు ఇచ్చిన పట్టాలను రద్దుచేసింది. ప్రస్తుతం ఆ భూమిని స్థానిక దళితులు, ఇతర పేదలకు ఇవ్వాలని పోరాడుతోంది. వంగర మండలం పెద్దశిర్లాంలోని 50దళిత కుటుంబాలు సాగుచేస్తున్న భూములపై హక్కు కల్పించాలని పోరాడింది. ఇటు ఎస్.కోట, మెంటాడ, పాచిపెంట మండలాల్లో గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని ఆందోళన చేపట్టింది. విజయనగరం, నెల్లిమర్ల నగర పంచాయతీలో పేదల కోసం నిర్మించిన టిడ్కోఇళ్లను అప్పగించాలని లబ్దిదారులతో కలిసి ఆందోళన చేపట్టింది. ఫలితంగా కొంతమేర ఇళ్లను అప్పగించారు. మిగిలిన వాటితోపాటు బొబ్బిలిలోనూ పంపిణీ చేయాలన్న డిమాండ్‌తో సిపిఎం ముందుకు కదులుతోంది. సహారా ఇండియాలో పొదుపు చేసిన వారు జిల్లాలో వేలాదిగా నష్టపోయారు. వీరిని ఆక్వున చేర్చుకుని, వారి ఖాతాల్లో డబ్బులు జమచేయాలంటూ కొత్తవలస, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది.



మైథాన్‌పై పోరాటంలో 40 మందికి జైలు జీవితం

బొబ్బిలిలో మైథాన్ యాజమాన్య నిరంకుశ విధానాలపై పోరాడిన కార్మికులపై అప్పటి ప్రభుత్వం 40 మంది మహిళలు, సిపిఎం నాయకులపై అక్రమ కేసులు బనాయించింది. విశాఖ సెంట్రల్ జైలుకి పంపింది. చివరికి కార్మికుల సమస్య పరిష్కారమైంది.

భూగర్భ జలాల పరిరక్షణ - అందరికీ ఉచిత తాగునీరు

భూగర్భ జలాల పరిరక్షణ - అందరికీ ఉచిత తాగునీరు అనే లక్ష్యంతో జిల్లాలోని అక్రమ వాటర్ ప్లాంట్లకు వ్యతిరేకంగా సిపిఎం పెద్ద ఎత్తున ఉద్యమించింది. తొలుత విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్పనగర్‌లో ప్రారంభించిన ఈ ఉద్యమం జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. అయ్యప్పనగర్‌లో చేపట్టిన పోరాటానికి అప్పటి వైసిపి ప్రభుత్వం అక్రమార్కులకు అండగా నిలిచినప్పటికీ సిపిఎం నాయకులు వెరవలేదు. దీంతో, నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. చివరకు ఆ ప్లాంట్‌తోపాటు అక్రమ ప్లాంట్లన్నీ సీజ్‌చేయాలంటూ సాక్షాత్తు న్యాయస్థానమే తీర్పునిచ్చింది.

స్టీల్‌ప్లాంట్ రక్షణలో సిపిఎం

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం మన జిల్లాలో సైతం నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ప్లాంట్ నుంచి వచ్చిన బైక్ యాత్ర, జీపుజాతా కార్యక్రమాల్లో కేవలం స్టీల్‌ప్లాంట్ కార్మిక కుటుంబాలే కాకుండా శక్తి మేర జిల్లా వాసులను పాల్గొనేలా చేసింది. సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసింది. విజయనగరంలో జరిగిన సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరయ్యారు.

ప్రజారక్షణ భేరీ

సిపిఎం సమర భేరీ పేరిట చేపట్టిన విలువ ఆధారిత ఆస్తిపన్ను, నీటి పన్ను రద్దుచేయాలని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మానుకోవాలని, యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్నో నిరసనలు, ధర్నాలు, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టింది. ప్రజారక్షణ భేరీ పేరిట, జిల్లాలో రెండు బృందాలు జిల్లాలో జీపుజాతా నిర్వహించాయి. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం కూడా పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా...

జిల్లాలో రహదారులు, రైల్వే ట్రాకులు, సాగునీటి ప్రాజెక్టుల కింద నిర్వాసితులయ్యే వారిని రైతులు, ఇతర ప్రజానీకానికి సిపిఎం అండగా నిలిచింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా మెంటాడ, గంట్యాడ, విజయనగరం తదితర మండలాల్లో భూమి కోల్పోయిన రైతులకు మెరుగైన పరిహారం కోసం పోరాడింది. కొత్తవలస, జామి, విజయనగరం, గజపతినగరం మీదుగా అటు బొబ్బిలి వరకు చేపట్టిన మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పైప్ లైన్ వల్ల భూములు కోల్పోయినవారికి న్యాయం జరిగేలా పోరాడింది. రైతులకు సబ్సిడీలు పెంచాలని, ధాన్యం, పత్తి, మొక్కజొన్న, చెరకు తదితర వ్యవసాయ ఉత్పత్తులపై మద్దతు ధర పెంచాలని, ధర, తూకంలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని, మార్కెట్ సదుపాయాన్ని పెంచాలని డిమాండ్లతో సిపిఎం ఆధ్వర్యాన నిరంతరం పోరాటాలు జరుగుతునే ఉన్నాయి.

మరణించినా జీవించాడు

- బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడు అవయవ దానం
- గ్రీన్‌ఛానల్ ద్వారా విశాఖకు, అక్కడి నుంచి చెన్నైకు తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట/పాచిపెంట

ఆ యువకుడు మరణించినా జీవించే ఉంటాడు. రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బ్రెయిన్‌డెడ్ కావడంతో అతడి అవయవాలను దానం చేసి ఆ తల్లిదండ్రులు మరో నలుగురికి ప్రాణం పోశారు. జిల్లా చరిత్రలోనే తొలిసారి ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది.

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయి కుమార్ (21) ఈనెల 12న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమల -మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందాడు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో సాయికుమార్ గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను జీవన్‌దాన్ సభ్యుల సహకారంతో భద్రపర్చిన వైద్యులు నాలుగు అంబులెన్సులు, ఒక కారులో విజయనగరం మెడికవర్ నుంచి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నడుపుతున్న లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ద్వారా గ్రీన్ ఛానల్‌లో విశాఖ ఎయిర్ పోర్టుకు తరలించారు. అక్కడి నుంచి విమానంలో చెన్నై తరలించారు. మెడికవర్ ఆసుపత్రి నుండి విశాఖ ఎయిర్ పోర్టుకు అవయవాల తరలింపునకు ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శంభాన రవి పైలట్‌గా జిల్లా సరిహద్దు అయిన రాజాపులోవ వరకు తరలించగా, అక్కడ నుండి విశాఖపట్నం సిటీ పోలీసులు అంబులెన్సు, ఇతర వాహనాలకు గ్రీన్ ఛానల్ ద్వారా పైలట్ చేశారు.



అవయవాలను తరలిస్తున్న అంబులెన్స్

సాయికుమార్ తల్లిదండ్రులు లంకేన లక్ష్మణరావు, శ్రీదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కమారుడు సాయికుమార్, కుమార్తె స్రవంతి ఉన్నారు. సాయికుమార్ పదో తరగతి వరకు చదువుకొని మానేసి ఆర్‌టిసి హైర్‌బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్రవంతి ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. సాయికుమార్ తాతగారి ఇంటి వద్ద మక్కువలో ఉంటూ రోజూ స్వగ్రామం వెళ్లి వస్తుంటాడు. ఆ క్రమంలో మంగళవారం రాత్రి కొత్తవలస నుంచి మక్కువ బైక్‌పై వస్తుండగా దుగ్గేరుసమీపంలో తీవ్రంగా గాయపడి పడిఉన్న అతడిని స్థానికులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరంలోని తిరుమల -మెడికవర్ ఆసపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని అంబులెన్సులో స్వగ్రామం కొత్తవలస తరలించారు. గ్రామస్తులు, యువత పెద్దఎత్తున హాజరై అవయవదాతకు జోహార్లు అంటూ నివాళులర్పించారు. ఇదిలా ఉండగా సాయికుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



సాయికుమార్ మృతదేహం

తాజ్ హోటల్‌కు స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

తాజ్ హోటల్ నిర్మాణానికి సముద్ర తీరాన ఉన్న భూములను రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. ఇటీవల తాజ్ గ్రూపు ప్రతినిధులు భూముల పరిశీలనకు వచ్చిన విషయం తెలిసిందే. సముద్రతీరాన ఉన్న భూములు కావాలని వారు జిల్లా అధికారులకు సూచించారు. భీమిలి మండలం అన్నవరం రెవెన్యూ పరిధిలో ఒబెరాయ్ హోటల్‌కు కేటాయించిన ప్రాంతానికి సమీపంలోని స్థలమైతే బాగుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ ఎం.సురేష్ కంచేరుపాలెం రెవెన్యూ పరిధిలోని సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న భూములను పరిశీలించారు. కానీ ప్రభుత్వ భూములు ఎక్కడా అందుబాటులో లేనట్లు తెలిసింది. తీరానికి ఆనుకొని ఉన్న భూములన్నీ జిరాయితీగా ఉన్నట్లు గుర్తించారు. సర్వేయరు మధుకేశ్వరరావు, విఆర్ఒ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై వీడిన ఉత్కంఠ

రఘురాజుకు ఊరట ● శంబంగికి నిరాశ ● ఎమ్మెల్సీ ఉపఎన్నిక రద్దుచేసిన ఇసి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు తెర ఎట్టకేలకు వీడింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్‌ను రద్దు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఊరట కలిగింది. ఇదే పదవి కోసం నామినేషన్ దాఖలు చేసిన వైసిపికి చెందిన బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుకు నిరాశ ఎదురైంది. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. కాలపరిమితి ప్రకారం ఆయన 2027 నవంబర్ 31 వరకు కొనసాగాల్సివుంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును మార్చాలని సాక్షాత్తు సిఎం ఎదుట పట్టుబట్టారు. అంతకు ముందు నుంచే ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేశారు. ఈవైరంతో పార్టీ ఆయన్ని పక్కనబెట్టింది. దీంతో, గత ఎన్నికల్లో ఆయన భార్య సుబ్బలక్ష్మి సహా ఆనుయాయులందర్నీ టిడిపిలోకి పంపారు. ఏకాకిగా మిగిలిన రాఘురాజు తమకెందుకన్నట్టు 'ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారు' అన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో, శాసన మండలి చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేసిన సంగతి విధితమే. దీనిపై రఘురాజు అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆరువారాలపాటు స్టే విధించింది. ఈ విషయమై ఈనెల 6న కోర్టు తీర్పురావాల్సి ఉన్నప్పటికీ, 3వ తేదీనే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్ విడుదల చేసింది. వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. వాస్తవానికి కోర్టు వాయిదా మరో మూడు రోజుల్లో ఉందని తెలిసి కూడా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసియడం, 6వ తేదీన సిట్టింగ్ ఎమ్మెల్సీకి అనుగుణంగా కోర్టు తీర్పు వెలువడం వంటి కారణాలతో ఎన్నికల ప్రకియపై అద్యంతం ఉత్కంఠగా ఎదురు చూసింది. అయినప్పటికీ వైసిపి తరపు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికీ వెనక్కి తగ్గకపోవడంతో ఈనెల 11న చివరి రోజు రఘురాజు భార్య నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు కోర్టు ఆదేశాలతో తాను ఎమ్మెల్సీ పదవిలో కొనసాగేందుకు ఎలాంటి ఢోకా లేందంటూ ఇందుకూరి రఘురాజు ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు స్పందించిన ఎన్నికల కమిషన్ ఎన్నికలను రద్దు చేస్తూ గురువారం ఉత్తర్వులను జారీచేసింది. దీంతో, ఉత్కంఠకు తెరపడింది.



రఘురాజు

కలెక్టర్‌తో గ్రామీణాభివృద్ధి శాఖ ఎసి భేటీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివ ప్రసాద్ గురువారం జిల్లాలో పర్యటించారు. ఎస్.కోట మండలంలోని ముషిడిపల్లి, గోపాలపల్లి, వినాయక పల్లి, ఎల్.కోట మండలంలోని కిట్టన్న పేట, ఖాసా పేట, కొట్యాడ, ఎల్.కోట తలారి తదితర గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపడుతున్న పల్లెపండగ పనులను పరిశీలించారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను కలిసి పనులు జరుగుతున్న తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో డ్వామా ఇన్‌ఛార్జి పీడీ కళ్యాణ చక్రవర్తి, పంచాయితీ రాజ్ ఎస్‌ఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అదనపు కమిషనర్ శివప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

108ను ప్రభుత్వమే నిర్వహించాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని 108 ఉద్యోగుల సంఘం నాయకులు జి.వేణుగోపాలనాయుడు, ఎం.శోభన్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు 108ను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగ భద్రత కల్పించాలని గురువారం బొబ్బిలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. 108ను ప్రభుత్వమే నిర్వహించి బకాయి వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనాలు, రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శ్రీను, ఎంపిడిఒ రవికుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు మహేశ్వరరావు, రాంబాబు, అప్పారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఉద్యోగులు శ్రీనివాసరావు, కొండలరావు.. తహశీల్దార్ శ్రీను, ఎంపిడిఒ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

తెర్లాం : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ 108 ఉద్యోగులు.. గురువారం స్థానిక తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబుకు వినతులు అందించారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 25 నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు బోను వెంకటరమణ, పిల్ల రమణ, పుప్పాల గౌరీ శంకర్, అమర రాజేష్, అప్పారావు పాల్గొన్నారు.




బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

సిఎంను కలిసిన గ్రీష్మ

ప్రజాశక్తి-రాజాం

సిఎం చంద్రబాబును మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కావలి గ్రీష్మ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రీష్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే టిక్కెట్ త్యాగం చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో అధిష్టానం గుర్తించిందన్నారు. తల్లి ప్రతిభా భారతి రాజకీయాన్ని పుణికి పుచ్చుకుని ముందుకు వెళు తున్నట్లు తెలిపారు.



సిఎంకు మొక్క అందజేస్తున్న కావలి గ్రీష్మ

పోసానిపై టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , హోంశాఖా వంగలపూడి అనిత , రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ , టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు పై అనుచిత, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, వైసిపి నాయకుడు పోసాని కృష్ణమురళి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం టిడిపి నాయకులు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి పి.రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కనకల మురళీ మోహన్, విజ్జి ప్రసాద్, కుర్రోతు నర్సింగరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు దేవాలయాలు

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ● 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రంథాలయాలు దేవాలయాలు లాంటివని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ స్మారక జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ అంబేద్కర్ ముఖ్య అతిధిగా హాజరై బాలల దినోత్సవం సందర్భంగా ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తకాల ద్వారా గొప్ప జ్ఞానాన్ని ప్రసాదిస్తాయని చెప్పారు. ప్రతీఒక్కరూ పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని కోరారు. పుస్తకాలు అందుబాటులో లేనివారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా జ్ఞానాన్ని సంపాదించి గొప్ప పేరు ప్రఖ్యాతులు సముపార్జించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

డిఇఒ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, పుస్తకాలు ఎంతో విలువైనవని అన్నారు. ఎంతోమంది పెద్దలు తమ జీవితానుభవాలను క్రోడీకరించి, ఎంతో అధ్యయనం చేసి పుస్తకాలను రచిస్తారని, వాటిని చదవడం ద్వారా సారాన్ని గ్రహించాలని కోరారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ , జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి బి. లక్ష్మి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాధాన్యత, గ్రంథాలయోధ్యమ చరిత్రను వివరించారు.



గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

పుస్తకాల్లో మాత్రమే గొప్ప జ్ఞానం

పుస్తకాల్లో మాత్రమే గొప్ప జ్ఞానం ఉంటుందని రిటైర్డ్ డిఇ డాక్టర్ ఎంవిఎన్. వెంకట్రావు అన్నారు. గాజులరేగ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్ పి హెచ్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు గ్రంథాలయాల గొప్పతనాన్ని వివరించారు.

విజయనగరం టౌన్ : గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రోటరీ క్లబ్ (డిస్ట్రిక్ట్ 3020) గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్యబాబు, సంఘం మండల కన్వీనర్ బి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తహశీల్దార్ చిన్నారావు అన్నారు. బుధవారం రేగిడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభించారు. విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, జి.శ్రీదేవి, ఎ.రవణమ్మ, నెక్కల బంగారు నాయుడు, లావణ్య, లైబ్రేరియన్ ఎం.రామలక్ష్మి పాల్గొన్నారు.

రాజాం : రాజాం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.అమర్‌నాథ్ ఆధ్వర్యాన రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ సిబ్బంది రవణమ్మ, బిడిసి నిర్వాహకులు జగదీశ్వరరావు, రాము, జ్ఞానజ్యోతి ప్రిన్సిపల్ తారక్ పాల్గొన్నారు.

తెర్లాం : స్థానిక శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్.కృష్ణమూరి ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి ఎంఇఒ జె.త్రినాథరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, విశ్రాంత ఎంఇఒ సత్యనారాయణ పాల్గొన్నారు. మండలంలోని తెర్లాం, పెరుమాళి, లోచర్ల సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

నెల్లిమర్ల : జరజాపుపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకులు జె.నారాయణమ్మ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘం ముఖ్య సలహాదారు కడలి ప్రకాశరావు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు సుంకరి వాసుదేవరావు, సత్య కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు పి.సంతోష్ భార్గవి, కె.శ్యామల, పోలేటి గౌరీ పాల్గొన్నారు.

బొబ్బిలి : బొబ్బిలి గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఎంఇఒ బి.నర్సింగరావు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, పిఇటి శాంతి, గ్రంథాలయ అధికారి దామోదర్ శ్రీధర్ పాల్గొన్నారు.

గుర్ల : గుర్ల శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయ అధికారి పి.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ నారాయణరావు, ఎంఇఒ భానుప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కెజిబివి ఎస్ఒ జానకి, ఉపాధ్యాయులు పద్మలత, గుర్ల మండల సేవా సమితి సభ్యులు ఈశ్వరరావు పాల్గొన్నారు.

మెంటాడ : మెంటాడ గ్రంథాలయంలో నిర్వాహకులు మరడాన త్రినాథరావు ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో నీలాతి అప్పలనాయుడు, రెల్లి పైడిపునాయుడు, చిట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడ శాఖా గ్రంథాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేష్, రిటైర్డ్ లైబ్రేరియన్ దేవుడు పాల్గొన్నారు.

సంతకవిటి : సంతకవిటి గ్రంథాలయంలో వారోత్సవాలను ఎంపిడిఒ సురేష్ కుమార్ ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డోల శ్రీదేవి పాల్గొన్నారు.



రేగిడి.. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహశీల్దార్ చిన్నారావు

ప్రజా సమస్యలపై పోరుబాట

ప్రజాశక్తి-మెంటాడ

ప్రజా సమస్యలపై పోరుబాట చేపట్టినట్లు సిపిఎం మండల కన్వీనర్ రాకోటి రాములు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్ల ప్రజా జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.సోములు, పి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో 'గ్లోబల్ వ్యూ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రామభద్రపురం

విజయనగరంలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలో గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఆ పోటీలలో చదువుతున్న అక్కాచెల్లెలు లిఖితరావ్ బంగారు, తోక్షరావ్ కాంస్య పతకం సాధించారని స్కూల్ చైర్మన్ పోల వెంకటరమణ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఆయనతోపాటు కరస్పాండెంట్ చంద్రమోహన్, ప్రిన్సిపల్ సంధ్య, కోచ్ సుధాకర్ అభినందించారు.

ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడలో ఆరోగ్య సిబ్బంది గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వేలో బిపి, షుగర్, థైరాయిడ్, జ్వరాలు తదితర వాటిని గుర్తించి మందులు సరఫరా చేశారు. ఆశా కార్యకర్తలు సుజాత, ఆదిలక్ష్మి, కుమారి ఈ సేవలు అందించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎస్.సంతోషి పాల్గొన్నారు.

టిడిపిలోకి సింగవరం సర్పంచ్

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరం సర్పంచ్ పిట్ట పద్మావతి, మాజీ సర్పంచ్ లంక అప్పలనాయుడు ఆధ్వర్యాన సుమారు 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో వీరికి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పతివాడ అప్పలనారాయణ.. పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాదరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దంతులూరి ప్రదీప్ రాజు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, ఉపాధ్యక్షుడు పడాల చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పంపిణీలో అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటి పంపిణీలో అప్రమత్తత అవసరమని సిబ్బందికి నగరపాలక సంస్థ ఇఇ రాయల్‌బాబు సూచించారు. గురువారం ఆయనతో పాటు డిఇ ప్రసాదరావు వాటర్ ట్యాంకుల వద్దకు వెళ్లి నీటి పంపిణీ విధానం, నీటి నాణ్యతను పరిశీలించారు. నీటి క్లోరిన్ పరీక్షలను చేసి మెరుగైన ఫలితాలను గుర్తించారు.కంటోన్మెంట్ జంక్షన్ వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద నీటి పంపిణీ, పంపింగ్ విధానం గమనించారు. అన్ని సక్రమంగా ఉండడంతో సిబ్బందికి పలు మెరుగైన సూచనలు చేశారు.

జనన ధ్రువపత్రాల జారీని సరళతరం చేయాలి

ప్రజాశక్తి-వంగర

అపార్ నమోదుకు జనన ధ్రువపత్రాల జారీని సరళతరం చేయాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధికారులను కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆధార్.. అపార్‌తో నమోదు చేయడంపై తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. వాటిని అధిగమించేందుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వెల్లడించారు. సకాలంలో ధ్రువపత్రాలు జారీ కాకపోవడం, చాలా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించడంతో బర్త్ సర్టిఫికెట్ జారీకి ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఆటంకం లేకుండా బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాన్ని గురువారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, సౌకర్యాలపై ఆరాతీశారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గురుకులంలో భోజనాన్ని, సరుకులు నిల్వ ఉంచిన గదులను, వంటశాలను, గురుకుల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు, ప్రిన్సిపల్ ఉషారాణి, అధ్యాపకులు లక్ష్మి పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో మధుమేహం అదుపులోకి

ప్రజాశక్తి- తెర్లాం

జీవనశైలిలో మార్పులతో మధుమేహాన్ని అదుపులోకి తీసుకురావచ్చని ఆయుష్ వైద్యులు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో వైద్యులు రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు, సిబ్బందికి మధుమేహం నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి మార్చడంతోపాటు సరైన వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడి తగ్గించడం ద్వారా మధుమేహం రాకుండా చేసుకోవచ్చునని, అదుపులో పెట్టుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపాలనాయుడు, రాధమ్మ, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు నర్సుపల్లి నాగేశ్వరరావు, హెచ్‌ఎ గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన గురువారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రమణమూర్తి, ఉపాధ్యాయులు శ్యామ్ షణ్ముఖరావు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎల్‌పిజి వంట గ్యాస్ వినియోగం, వినియోగదారుల భద్రత, ప్రమాదాలపై విద్యార్థినులు పూర్తి అవగహన కలిగి వుండాలని విజయనగరంలోని సీతారాం ఇండేన్ సర్వీస్ నిర్వహకులు తలే సీతారాం పిలుపునిచ్చారు. దాసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇండేన్ వినియోగదారుల భద్రత శిబిరం నిర్వహించి ఎల్.పి.జి. వంట గ్యాస్ వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్లు ప్రమాదాలకు గురైనప్పుడు, పేలినా, గ్యాస్ లీకేజి జరిగినా చాకచక్యంగా వ్యవహరించి వినియోగదారులు వెంటనే 1906 నెంబరుకు ఫోన్ చేసిప్రమాదాన్ని నివారించు కోవచ్చన్నారు. ప్రముఖ ఎస్.వి.ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.అనిల్ కుమార్, డాక్టర్ టి.శిరీషా, డాక్టర్ టి.సుధీర్ తదితరులు మాట్లాడారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

ప్రజాశక్తి - జామి

మండలంలోని జట్టేటివలసలో టిడిపి నాయకుడికి చెందిన బెల్ట్ షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి, భారీగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే టిడిపి పెద్దలు ఒత్తిళ్లతో పట్టుబడ్డ మద్యాన్ని తక్కువగా చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జట్టేటివలసలో లైసెన్స్ షాపు తరహాలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నట్లు అందిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు దాడులు చేసినట్లు సమాచారం. జామి మండల కేంద్రంలో అధికారిక షాపు నుంచి మద్యం తరలించినట్లు గుర్తించినప్పటికీ పట్టుబడ్డ బాటిళ్లపై లేబుళ్ళు తొలగించారని తెలిసింది. దీనిపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావును 'ప్రజాశక్తి' ఫోన్లో వివరణ కోరగా, ఇంకా తమదృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యాపారిని అరెస్టు చేసి 30మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి వ్యాపారిని అరెస్ట్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువే బంగారు భవిష్యత్తుకు పునాది

బాలల దినోత్సవంలో డిఇఒ మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి-డెంకాడ

చదువే బంగారు భవిష్యత్తుకు పునాదని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. మండలంలోని పెదతాడివాడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో నెహ్రూ, సరస్వతి దేవి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలలు చదువుతోపాటు క్రీడలు, మిగిలిన అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. చదువుతోనే మన నడవడిక ముడిపడి ఉందని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వి.రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యువిఎ నరసింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలు, విద్యార్థులు నెహ్రూ, గాంధీ, సుభాష్ చంద్రబోస్, తదితర స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు ముందుండాలని పాఠశాల సెక్రటరీ డి.పద్మ, యాజమాన్య ప్రతినిధులు ఎస్.గౌరీశంకర్, కె.రామారావు సూచించారు.

శృంగవరపుకోట : మండలంలో డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ సేవలను ప్రిన్సిపల్ వై.జానకీదేవి వివరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

జామి : జామిలో నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ శంగవరపుకోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గేదెల తిరుపతిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులను కలిసి నెహ్రూ గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగి నెక్కలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : ముసిరాం అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని సిడిపిఒ ఆర్.ఉమాదేవి, ఎసిడిపిఒ బి.లక్ష్మిబాయ్ నేతృత్వంలో సూపర్‌వైజర్లు కె.రమణమ్మ, కె.స్వర్ణలత ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు జి.శ్యామల, డి.రామలక్ష్మి పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి హైస్కూల్లో హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గరివిడి : తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెస్ట్ యూనిఫాం ధరించిన విద్యార్థులకు హెచ్‌ఎం ఎ.సత్య శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.


డెంకాడ.. మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యంనాయుడు

మెరకముడిదాం : మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

రామభద్రపురం : నాయుడువలస పాఠశాలలో హెచ్‌ఎం జెసి రాజు ఆధ్వర్యాన నిర్వహించిన బాలల దినోత్సవంలో నెహ్రూ చిత్రపటానికి ఎస్ఐ ప్రసాదరావు నివాళులర్పించారు. ఎస్ఎంసి చైర్మన్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : స్థానిక గురజాడ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిపిఆర్ఒ ఎస్. జానకమ్మ హాజరయ్యారు. విద్యార్థుల వివిధ రకాల వేష ధారణలు ఆకట్టుకున్నాయి. 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు పిల్లలకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు జానకమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణల్లో గురజాడ స్కూల్ విద్యార్థులు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం : ఎస్‌పి

విజయనగరం టౌన్ : అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరమ్, ఎపి ప్రో చైల్డ్ గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం లో 'బాల్యవివాహాలు నిర్మూలిద్దాం-బాలల హక్కుల కాపాడుదాం' అనే గోడపత్రికను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీతారమన్నారు. బాల్య వివాహాలు ఎవరు చేసినా తల్లిదండ్రులు పెద్దలు ఎవరైనా ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిస్ట్రిక్ట్ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ చైర్మన్ పి చిట్టిబాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బెంచ్ సభ్యులు సురగాల చిట్టిబాబు, డిబిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు యందవ పోలయ్య, ప్రజ్వల సంఘం ప్రతనిధులు మొండూరి పోతరాజు పాల్గొన్నారు.

పోలీసు వెల్ఫేర్ స్కూల్లో..

విజయనగరం కోట : పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై, పోలీసు వెల్ఫేర్ పాఠశాలలో అదనంగా నిర్మించిన రెండు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు, వాగులు ఆక్రమిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగర పరిధిలో గెడ్డలు, వాగులు, ప్రధాన కాలువలు ఆక్రమించి భవన నిర్మాణాలను చేపట్టారాదని, నిబంధనలు ఆక్రమించినట్లయితే అట్టి భవనాలను తొలగిస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. గురువారం ఐదవ డివిజన్లో పర్యటించారు. అనుమతులు లేని కొన్ని భవనాలను గుర్తించి, తక్షణమే అపరాద రుసుములు విధించి, వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. గెడ్డను ఆక్రమించి నిర్మించిన ఓ భవనాన్ని గుర్తించి వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ భవనానికి పన్ను విధింపుతో పాటు ఖాళీ స్థలం పన్నును కూడా విధించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదని అన్నారు. సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నైపుణ్య గణన శత శాతం పూర్తి చేయాలి

ఇంటింటి నైపుణ్య గణన సర్వే శతశాతం పూర్తిచేయాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి కమిషనర్ పల్లి. నల్లనయ్య ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పరిధిలో వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన, అలాగే ప్రతిభ ఉన్న వ్యక్తులను గుర్తించి తద్వారా వారికి మరింత మెరుగైన తర్ఫీదు నిచ్చి ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వచ్చే తమ సిబ్బందికి పూర్తి వివరాలను అందించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, స్కిల్ సెషన్స్ మండల ఇన్చార్జి తరుణ్ పాల్గొన్నారు.

దోమల నివారణతో ఆరోగ్యకర సమాజం

అప్పన్నదొరపాలెంలో డిఎంఒ మణి పర్యటన

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి తెలిపారు. గురువారం మండలంలో అప్పన్నదొరపాలెం గ్రామంలో పిహెచ్‌సి వైద్యాధికారి డి.సీతల్ వర్మతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామంలో కొద్దిరోజులుగా ప్రజలు జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. మంచినీటిలో వృద్ధి చెందే దోమల ద్వారా డెంగీ, చికున్ గున్యా జ్వరాలు వస్తాయని తెలిపారు. ప్రజలు కొద్దిగా జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఈ సీజన్లో వచ్చే జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు సీతల్ వర్మకు పలు సూచనలు చేశారు. గ్రామంలో మంచినీటి చెరువులో, బావుల్లో గంబుషియా చేపలు విడుదల చేశారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గ్రామసుత్లకు సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ అప్పలకొండ, పిహెచ్ఎన్ రవణమ్మ, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెచ్‌వి బేబీరాణి, హెల్త్ సూపర్‌వైజర్ సూరిదేముడు, ఎంఎల్‌హెచ్‌పి సునీత, హెల్త్ అసిస్టెంట్ శేషుబాబు, ఎఎన్ఎం వరలక్ష్మి, ఆశాలు లక్ష్మి, పైడిరాజు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రేగిడి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు విఒఎలకు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలతో ఉల్లాస్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్యామలకుమారి, ఎపిఎం బాసిన గోవిందరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి విఒఎ పరిధిలో పది మందికి ఒక వాలంటీర్‌ను నియమించుకోవాలన్నారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విఒఎలకు ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. గ్రామస్థాయిలో విఒఎలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎపిఎం పాల్గొన్నారు.

డెంకాడ : అక్షరాస్యతను పెంపొందించాలని వయోజన విద్య డిడి సోమేశ్వరరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పది మందికి ఒక వాలంటీర్‌ని నియమించి ఆరు నెలలపాటు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.భవాని, ఎపిఎం శ్రీనివాసరావు ఎంఎల్ఒ రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 33/11 కెవి కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో మరమత్తులుని సరి చేసే సమయంలో సబ్ స్టేషన్ మీద ఉన్న ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. పావని నగర్ ,అరుంధతి నగర్ ,కాంబోయి వీధి ,రెల్లివీధి, గణేష్ కోవెల రోడ్, హోటల్ షాలీమార్ వెనుక ప్రాంతం, మర్రి చెన్నారెడ్డి కాలనీ , సిక్కులకానీ ,రామయ్యమ్మ కాలనీ , బిసి కాలనీ , యాతపేట, జర్నలిస్ట్ కాలనీ, రాజుల కాలనీ, ద్వారపూడి రోడ్ , రెవిన్యూ కాలనీ ,బ్యాంకు కాలనీ ,సాయి కీర్తన నగర్ ,కామాక్షి నగర్ ,సాయి లలితా నగర్ , కె యల్ పురంనకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

వేపాడ మండలంలో..

వేపాడ : వేపాడ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో 11కెవి వీలుపర్తి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు ఇఇ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వీలుపర్తి, వెల్దాం, దుంగాడ, బొర్రవలస, సిహెచ్‌డి అగ్రహారం, వావిలపాడు, కడకొండ, దబ్బిరాజుపేట, చామలాపల్లి, కరకవలస, వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం, మారిక గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

నెల్లిమర్ల మండలంలో..

నెల్లిమర్ల : నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి టౌన్ ఫీడర్ పై లైను కింద చెట్ల తొలగింపు, నిర్వహణ పనుల కోసం శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డిఇ పి.త్రినాథరావు తెలిపారు. థామస్‌పేట, మొయిద జంక్షన్, సెగిడివీధి, కందర్పకాలనీ, టీచర్స్ కాలనీ, గౌడవీధి, బోయ వీధి , తెలకల వీధి, రెల్లి వీధి, గొల్ల వీధి, పద్మశాలి వీధి, తెలగవీధి, చిక్కాల వీధి, గాంధీనగర్‌కాలనీ, జరజాపుపేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

నిబంధనలకు లోబడే వైన్‌షాపునకు లైసెన్స్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మేదరబంద జంక్షన్‌లో వైన్‌షాపుకు ప్రభుత్వ నిబంధనలకు లోబడే లైసెన్స్ ఇచ్చామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు ఒక ప్రకటనలో చెప్పారు. గతంలో బజారులో షాపుకు లైసెన్స్ ఇస్తే ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎమ్మెల్యే బేబినాయన సూచన మేరకు లైసెన్స్ రద్దు చేసి, మేదరబంద జంక్షన్‌లో షాపుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. వాణిజ్య ప్రాంతంలో షాపు పెట్టామని, ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు సహకరించి ఆందోళన విరమించాలని కోరారు.

ఎంఆర్‌పికే మద్యం విక్రయించాలి

ప్రజాశక్తి-రాజాం

వైన్‌షాపుల్లో మద్యం కచ్చితంగా ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఆర్.జైభీమ్ ఆదేశించారు. ఈ మేరకు రాజాం సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలను గురువారం ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పి కంటే అదనపు ధరలకు అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పిఎం జీవన్ జ్యోతి బీమా వినియోగించుకోవాలని ఎపిజివిబి మేనేజర్ పి.రవికుమార్ కోరారు. గుర్ల మండలం చింతలపేటకు చెందిన సారంపాటి శ్రీను ఆకస్మికంగా మరణించడంతో ఆయన భార్య రమణమ్మకు గురువారం జరజాపుపేట ఎపిజివిబి బ్రాంచిలో మేనేజర్ రూ.2 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో, ఫీల్డ్‌ఆఫీసర్ లక్ష్మీ వాణి, సిఎస్‌పి పతివాడ పైడినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు ప్రజాప్రతినిధుల డుమ్మా

ప్రజాశక్తి-రేగిడి

2025 -26కు సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణకు గురువారం ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. కొంతమంది డమ్మీ ప్రజాప్రతినిధులతో 12 గంటలకు శిక్షణను ఇఒపిఆర్‌డి సత్యనారాయణ ప్రారంభించారు. సంకిలి, చెలికానివలస, ఆర్.ఆమదాలవలస, కోడిస సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. గ్రామ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాల్సిన ప్రజాప్రతినిధులే గైర్హాజరు కావడంతో శిక్షణను మమా అనిపించారు. మధ్యాహ్నం 12.25 గంటలకు వైస్ ఎంపిపిలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహన్‌రావు వచ్చిచూసే సరికి, ఎవరూ రాకపోవడంతో అసహనం అసహనం వ్యక్తం చేశారు. రెండో పూట వచ్చిన కొద్దిమంది కూడా లేకపోవడం ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. తొలిరోజు బుధవారం కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఒఎలకు శిక్షణ ఇచ్చిన విషయం తెలిసిందే.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-భోగాపురం

పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికల తయారీపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, విఒఎలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కిశోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ముందుగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. రిసోర్స్ పర్సన్లు సుప్రియ, రఫీ పటాన్ శిక్షణ ఇచ్చారు. ఇఒపిఆర్‌డి గాయత్రి, ఎఒ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరింతగా గ్రామాల అభివృద్ధి : గేదెల

ప్రజాశక్తి-నెల్లిమర్ల


మాట్లాడుతున్న గేదెల రాజారావు

కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. గురువారం దన్నానపేటలో ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తంగుడుబిల్లి ఎంపిటిసి చందక చిన్నంనాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల రహదారులు గత ప్రభుత్వంలో అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ రహదార్లకు మహర్దశ పట్టిందన్నారు. దీనిలో భాగంగానే రామతీర్థం-రణస్థలం రోడ్డు నుంచి తంగుడుబిల్లి మీదుగా కుమిలి వెళ్లే రహదారికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.85 లక్షల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు.

దేశ అభివృద్ధిలో నెహ్రూది కీలకపాత్ర

విజయనగరం కోట : భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక గాజుల రేగ పబ్లిక్ స్కూల్లో నెహ్రూ జయంతినిఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

బొబ్బిలి : క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోం పక్కనున్న ఎస్‌సి బాలికల వసతిగృహాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాలు నాణ్యతను పరిశీలించారు.

శ్లాబ్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాంలో ప్రమాదవశాత్తూ శ్లాబ్ నుంచి జారిపడి గురువారం మహిళ మృతిచెందింది. ఎస్ఐ బి.గణేష్ కథనం ప్రకారం.. కొండగుంపాం గ్రామానికి చెందిన శనపతి రమణమ్మ (54) నూతంగా నిర్మిస్తున్న ఇంటిపై నుంచి గోడలు తడుపుతున్నారు. ప్రమాదవశాత్తూ ఆమె కింద జారీ పడింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించింది. రమణమ్మ కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం రైల్వేస్టేషన్ యార్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 30 నుంచి 35ఏళ్ల వయసు ఉంటుందని, పింక్ కలర్ రెడీమేడ్ షర్ట్, బిస్కెట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి మోచేతిపై సిన్వెరెన్ అనే అక్షరం పచ్చబొట్టు వేయించుకున్నాడని తెలిపారు. జిఆర్‌పి ఎస్ఐ వి.బాలాజీ రావు కేసు నమోదు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మతుని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే ఫోన్ నెంబర్ 9490617089 ను సంప్రదించాలని కోరారు.